

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నగరంలో విద్యార్థులతో భారీ శోభాయాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకులు, పాల్గొన్న కార్యకర్తలు

గణేశ్‌నగర్, జూలై 9: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని కరీంనగర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు వేల మంది విద్యార్థులతో కోర్టు చౌరస్తా నుంచి ఎస్సారార్ కళాశాల వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఏబీవీఈపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి హాజరై మాట్లాడారు. 75 ఏళ్లుగా ఏబీవీపీ ఎన్నో విద్యారంగ సమస్యలపై పోరాటం చేసిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన ఏబీవీపీ దేశ నలుమూలలా విస్తరిస్తూ 50 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందని తెలిపారు. ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా అధిగమిస్తూ ఎన్నో విజయాలు సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమి స్తోందని తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ కోడి అజయ్, జిల్లా ప్రముఖ్ రాచకొండ గిరిబాబు, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి బామాండ్ల నందు, రాష్ట్ర కార్యాసమితి సభ్యులు అంజన్న, స్టేట్ లాఫోరమ్ కో కన్వీనర్ ప్రమోద్, వంశీ, విష్ణు, ప్రదీప్, విగ్నేష్, విష్ణు, ప్రశాంత్, ఆకాష్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ఏకైక సంస్థ ఏబీవీపీ

- కేంద్ర హోం శాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్: విద్యార్థుల సమస్యలతోపాటు విద్యార్థుల్లో నిర్మాణాత్మక మైన దేశభక్తిని పెంపొందించే ఏకైక సంస్థ ఏబీవీపీ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రటనలో అన్నారు. అ ఖిల భారత విద్యార్థి పరిషత్ ఏర్పాటై 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సంద ర్భంగా వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 75 ఏళ్ల క్రితం ఐదుగురితో ఢిల్లీలో ప్రారంభమై 50 లక్షలకు పైగా సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవిర్భవించిందన్నారు. కేరళ, తెలంగాణ, బెంగాల్, అసోం సహా అనేక రాష్ట్రాల్లో ఎంతో మంది కార్యకర్తలు హత్యకు గురైనా విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నదన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో ఏబీవీపీ పాత్ర మరువలేనిదన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా సత్యగ్రహాలు చేసి జాతిని ఏకం చేసిందన్నారు. వెంకయ్య నాయుడు, సుశీల్‌కుమార్ మోదీ, అరుణ్‌జైట్లీ, జేపీ నడ్డా సహా ఎందరో నాయకులు ఏబీవీపీ నుంచి ఎదిగిన వారేనని తెలిపారు.

ప్రమాదపుటంచున గురుకులాలు

- చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు
- కనీస వసతులు లేని ప్రైవేటు భవనాల్లో కొనసాగింపు
- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

గంగాధర, జూలై 9: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గురుకులాల్లో విద్యార్థులు భయం గుప్పిట్లో చదువులు కొనసాగిస్తున్నారు. ప్రైవేటు భవనాలకు లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్న ప్రభుత్వం కనీస వసతులపై దృష్టి సారించడం లేదు. చొప్పదండి నియోజకవర్గానికి నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, జ్యోతిబావుపూలే బీసీ బాలికలు, జ్యోతిబావుపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలను మంజూరు చేసింది. ఈ మూడు విద్యాలయాలను గంగాధరలో ఏర్పాటు చేశారు. ఈ మూడింటినీ అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెల ఒక్కొక్క భవనానికి సుమారుగా 1.8 లక్షల కిరాయి చెల్లిస్తోంది. లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నా ఈభవనాల్లో కనీస సౌకర్యాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంగాధర బ్లాక్‌లోని బీసీ జ్యోతి బావుపూలే బాలుర పాఠశాల బాత్‌రూం, మరుగుదొడ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ కనెక్షన్ ప్రమాదకరంగా ఉంది. సోమవారం హై వోల్టేజీ విద్యుత్ ప్రసారంతో వైర్లు తెగిపడగా ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పలు మార్లు తీగలనుతొలగించాలని విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గతేడాది ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకింది. తీవ్రంగా గాయపడి అదృష్టవశ్తు ప్రాణాలు నిలిచాయి. ఇదే పాఠశాలలో పై అంతస్తులో పిల్లల దుస్తులు ఆరవేయగా గాలికి కొట్టుకు పోయి భవనం పక్కనే ఉన్న 11 కేవీ తీగలపై పడ్డాయి. వాటిని తీసే క్రమంలో వాచ్‌మెన్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. పాఠశాల పక్కన ఉన్న వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదం జరిగిన మూడేళ్ల కనీసం చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లను తొలగిచాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జ్యోతిబాపూలే పాఠశాలను పరిశీలించిన ఆర్‌సీవో

గంగాధర జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలను మంగళవారం ఆర్‌సీవో అంజలి పరిశీలించారు. సోమవారం విద్యుత్ వైర్లు తెగిపడి పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలుకుని వివరాలను సేకరించారు. ఈసందర్భంగా ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలను తొలగించాలని భవన యాజమానిని ఆదేశించారు. ఘటన వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి 11కేవీ లైను తొలగించేలా చర్యలు తీసుకొవాలని సూచించారు. ప్రమాదం జరగడం బాధాకరమని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయలు ఉన్నారు.



బాలిక గురుకుల పాఠశాల పక్కన ప్రమాదకరంగా విద్యుత్ లైన్



బీసీ బాలుర గురుకుల పాఠశాలలో బాత్ రూంపై చేతికందే ఎత్తులో 11 కేవీ వైర్లు

డయేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, జూలై 9: చిన్నారులు డయేరియా బారిన పడకుండా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలాసత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో డయేరియా నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వాధ్యులు ప్రబలే అవకాశమున్నందున, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డయేరియా బారిన పడకుండా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు స్వశక్తి సంఘాల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. డయేరియా నివారణ చర్యలపై ఫ్లాష్ మాబ్‌లను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఐవో డాక్టర్ సాజిదా అతహరి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్, హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు పాల్గొన్నారు.

- పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించండి

కరీంనగర్ టౌన్: జిల్లాలో ఆయా శాఖల అధికారులకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ, ఫారెస్ట్ వివిధశాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. స్వశక్తి మహిళల ఆర్థిక అభ్యున్నతికి మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. వివిధ కేటగిరీల మహిళల ఆర్థిక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, డీపీవో రవీందర్, డీఎంహెచ్‌వో సుజాత పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

- ఇంటింటా ఇన్నోవేటర్‌లో కరీంనగర్‌కు గుర్తింపు తేవాలి

కరీంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ప్రజలు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆవిష్కరణలు పంపించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చక్కని ఆవిష్కరణలతో కరీంనగర్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గత ఏడాది జిల్లా నుంచి వంద ఆవిష్కరణలు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువ ఆవిష్కరణలు చేయాలని సూచించారు. వయసుతో నిమిత్తం లేదని, ఎవరైనా ఏ సమస్యపైన అయినా ఆవిష్కరణలు చేయవచ్చన్నారు. ఆవిష్కరణలు ఆగస్టు 3వ తేదీలోగా పంపించాలని సూచించారు. ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, వంద పదాలు, రెండు నిమిషాల నిడివిగల వీడియో ఆవిష్కరణ, పేరు, సెల్ నంబర్, వృత్తి, పూర్తి వివరాలను 9100678543 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా కో ఆర్డినేటర్ మణిదీప్, అధికారులు పాల్గొన్నారు.

నేడు జేఎల్ఎం అభ్యర్థులకు పరీక్ష

గణేశ్‌నగర్, జూలై 9: జూనియర్ లైన్‌మన్ పోస్టుల నియామకానికి అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలు టీజీఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల చిరునామాలకు ఇప్పటికే రిజిస్టర్ట్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, పోలు ఎక్కించే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు, అభ్యర్థులు దళారులను నమ్మవద్దని సూచించారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో అధికారులకు ర్యాంకులు

- టౌన్-1 ఏడీ, టౌన్-3 ఏఈకి ప్రథమ స్థానం



సాయినేని నరేందర్



దేవసాని సంపత్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 9: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) సీఎండీ కె వరుణ్ రెడ్డి అన్ని జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి వివిధ హోదాలలో పని చేస్తున్న అధికారులకు వారి పని తీరును బట్టి ర్యాంకింగ్స్ ఇచ్చారు. ఎన్పీడీసీఎల్ స్థాయిలో కరీంనగర్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ రెండో ర్యాంకు, డివిజనల్ స్థాయిలో కరీంనగర్ డీఈ జె రాజం రెండో ర్యాంకు సాధించారు. కరీంనగర్ సబ్ డివిజన్ అధికారుల్లో టౌన్ వన్ ఏడిఈ సాయినేని నరేందర్ ప్రథమ ర్యాంకు, టౌన్ టు ఏడిఈ సుధీర్‌కుమార్ రెండో ర్యాంకు సాధించారు. సెక్షన్ స్థాయి అధికారుల్లో కరీంనగర్ టౌన్-3 ఏఈ దేవసాని సంపత్ కుమార్ ప్రథమ ర్యాంకు, టౌన్-4 ఏఈ కె శ్రీనివాస్ రెండో ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన అధికారులను విద్యుత్ శాఖ సిబ్బంది అభినందించారు.

అధ్వానంగా ప్రభుత్వ వసతి గృహాలు



శిథిలావస్థకు చేరిన జమ్మికుంట బీసీ బాలుర వసతి గృహం



- కనీస వసతులు కరువు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

గణేశ్‌నగర్, జూన్ 9: విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచింది. ఇప్పటికీ ప్రభుత్వ వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదు. జిల్లాలో ఎస్సీ, బీసీ, గిరిజన అభివృద్ధిశాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సంక్షేమ వసతిగృహాల పరిస్థితి దయనీయంగా మారింది. పలు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహాల నిర్వహణకు అరకొర నిధులు కేటాయిస్తోందనే విమర్శలు ఉన్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని వసతిగృహాల బాత్ రూమ్ టైల్స్ పగిలి తలుపులుఊడిపోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో వర్షాకాలంలో ఊరుస్తున్నాయి. పలు చోట్ల గదులు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, గదుల్లో అరకొర సౌకర్యాలు వేధిస్తున్నాయి. జిల్లాలోని చాలా వసతి గృహాల్లో నాలుగో తరగతి సిబ్బంది లేరు. కలెక్టర్ చొరవచూపి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయంగా మారాయి. అనేక హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడ మౌలిక సదుపాయాలు లేవు . పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి.

వసతి గృహాలకు మరమ్మతులు చేయాలి

- సంద గణేశ్ యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు



హస్టల్స్ భవనాలు, బాత్ రూమ్ టైల్స్ పగిలి తలుపులు ఊడిపోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో వర్షాకాలంలో కురిసి గోడలునానే ప్రమాదం ఉంది. చాలా హాస్టళ్లలో అరకొర సౌకర్యాలే ఉన్నాయి. పలు భవనాలు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. జిల్లా అధికారులు హాస్టల్స్ భవనాలకు మరమ్మతులు చేపట్టి కనీస సౌకర్యాలు కలిపించాలి.

పది రోజుల్లో 'ధరణి' దరఖాస్తులను పరిష్కరించాలి

కరీంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పది రోజుల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాలో లక్ష్యం మేరకు మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళల గుర్తింపు, వారి శిక్షణ, బ్యాం ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందు బాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియను జిల్లాస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, నిబంధనల ను పాటించాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లా డుతూ జిల్లాలో వన మహోత్సవం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాలుగు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల జాబితా, ప్రస్తుతం ఉన్న ఖాళీల జాబితా శాఖలవారీగా ప్రదర్శించామని, ఈనెల 12 వరకు బదిలీల దరఖా స్తులను స్వీకరించి, పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి రణ్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీపీవో రవీందర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ బైఠాయింపు

రామగిరి, జూలై 9: తనకు న్యాయం చేయాలని ఓ మహిళ మంగళ వారం రామగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. రామగిరి మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన దాసరి శివకుమార్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకొని మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ముత్యాల కొమలత మే 25న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పాటు తన వద్ద నుంచి డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. తాను ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా పరారీలోనే ఉన్నాడని తెలిపింది. జూలై 8న గ్రామంలోని మెడికల్ షాప్‌నకు మందుల కోసం వెళ్తుండగా దాసరి శివ తమ్ముడు, చెల్లెలు కేసు విషయంలో రాజీపడాలని, లేదంటే తనను తన పిల్లలని చంపుతానని బెదిరింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేసింది. దాసరి శివ కుటుంబంతో తనకు ప్రాణభయం ఉందని, ఇప్పటికై పోలీసులు స్పందించాలని శివను అరెస్ట్ చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట రోదిస్తూ బైఠాయించింది. దీంతో మహిళ కానిస్టేబుల్‌లు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళను స్టేషన్ ఆవరణలోకి తరలించారు. కాగా ముత్యాల కొమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధిత మహిళకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకులపై కేసు నమోదు

రాయికల్, జూలై 9: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదైంది. వడుకాపురం శ్రీవాత్సవ్‌కు అదే గ్రామానికి చెందిన మాణిక్యం గంగాధర్, పందిరి ప్రమోద్‌లు రాయికల్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. దీంతో శ్రీ వాత్సవ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువురు యువకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.



బాలికను లైంగికంగా వేధించిన కేసులో మహిళకు జైలుశిక్ష

జగిత్యాల టౌన్, జూలై 9: బాలికను కిడ్నాప్ చేసి లైంగికంగా లోబర్చుకున్న ఓ మహిళకు ఒక కేసులో 5 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా, మరొక కేసులో మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..

కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు తన ఇంటి పక్కనే నివసిస్తున్న అస్మా అంజూ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. బాలికకు సదరు మహిళ మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లింది. అసభ్యకరమైన కార్యకలాపాలతో లైంగికంగా లోబరుచుకుంది. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారగా బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు నిందితురాలు అస్మా అంజూపై 2020-21 సంవత్సరంలో పోక్సోతో పాటు వివిధ సెక్షన్ల కింద రెండు కేసులు నమోదు చేశారు.

కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితురాలు అస్మా అంజూను కోర్టులో హాజరు పరుచగా అడిషనల్ పీపీ మల్లికార్జున్ కేసు వాదించారు. అప్పటి డీఎస్పీ రాజశేఖర్ రాజుతో పాటు ఎస్సైలు సతీష్, పృథ్వీధర్, రాజ ప్రమీల, రాజు నాయక్‌లతో పాటు కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, రాజు, నీల నాయక్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి నీలిమ నిందితు రాలు అస్మా అంజూకు జైలు శిక్షతో పాటు రూ. 15 వేల జరిమానా విధిస్తూ గత జూన్ 26న తీర్పు వెలువరించారు.

ఈ కేసుల్లో తప్ప కుండా శిక్ష పడుతుందని గమనించిన అస్మా అంజూ బెయిల్‌పై బయటి ఉండి విచారణకు రాకుండా శిక్ష పడిన జూన్ 26వ తేదీన కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న న్యాయమూర్తి నిందితురాలిపై వారెంట్ ఇష్యూ చేయగా మంగళవారం పోలీసులు నిందితురాలు అస్మా అంజూను పట్టుకుని జైలుకు తరలించారు. నిందితురాలికి జైలు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి కేసులో మరో ఇద్దరు అరెస్టు

మెట్‌పల్లి, జూలై 9: గంజాయి తరలింపు కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించాడు.

అదే సమయంలో అనుమానాస్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు గంజాయి తీసుకొని రెండు ద్విచక్ర వాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పారిపోగా మరో ఇద్దరు మైనర్లు పట్టుబడ్డారు. అందులో తప్పించుకుని పారిపోయిన విజయ్, ఉదయ్ ఇద్దరి కోసం ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లు గాలిం పు ముమ్మరం చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం శివారులో అనుమానాస్పందంగా కనిపించడంతో పట్టుకొని విచారించారు. నేరం ఒప్పుకొని మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తు న్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌తో పాటు నలుగురుని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురుకి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 9: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు జడ్జి మంగళవారం జైలు శిక్ష, జరిమా నా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవ ల తనిఖీల్లో పట్టుబడిన 23 మందిని కోర్టులో హాజరు పరచగా అందులో ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం 11వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 18 మందికి 27 వేల రూపాయలు జరిమానా విధించి నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక మైనర్‌కు 2,500 రూపాయలు జరిమా నా విధించినట్లు తెలిపారు.

వైద్యుడిని దూషించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 9: వైద్యుడిని దూషించి, దాడి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో పీజీ చదువుతూ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బానోతు రవి కుమార్ అనే వైద్యుడి విధులను ఆటంకపరచి దూషించి, దాడి చేసేందుకు యత్నించిన శ్యామ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈనెల 7న సాయంత్రం శ్యామ్ అనే వ్యక్తి ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలోకి వచ్చి తనకు చికిత్స చేయాలంటూ అక్కడ విధుల్లో ఉన్న వైద్యుడిని దూషించి, గ్లాస్ డోర్‌ను పగుల గొట్టాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





అంధుల గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని తండ్రి ఫిర్యాదు


శ్రీవత్సవ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 9: కొత్తపల్లి మండలం రేకుర్తి పరిధిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం దామ శ్రీవత్సవ్(13) అనే విద్యార్థి టవల్ మెడకు చుట్టుకుని మృతి చెందాడు. పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం మధ్యాహ్నం విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి మీ కొడుకు శ్రీవత్సవ్ వాంతులు చేసుకుంటున్నాడు, జ్వరం వచ్చినట్లుంది తొందరగా రావాలని చెప్పినట్లు శ్రీవాత్సవ్ తండ్రి దామ సది తెలిపారు. మళ్లీ ప్రిన్సిపాల్ ఫోన్ చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు చెప్పాడని, తాము వెళ్లి చూసే సరికి శ్రీవత్సవ్ మరణించి ఉన్నాడని చెప్పారు. పాఠశాలలోని సీసీ కెమెరా పుటేజీలను తాము కూడా పరిశీలించామని, శ్రీవత్సవ్ మధ్యాహ్నం దండానికి ఉన్న టవల్‌ను మెడకు చుట్టుకుని ఆడుతూ ఒక్కసారిగా ఆగిపోయినట్లు ఉందన్నాడు. శ్రీవత్సవ్ మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని దామ సది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ మండలం ముప్పిరి తోటకు చెందిన దామ శ్రీవత్సవ్‌కు పుట్టుకతోనే ఒక కన్ను కనిపించదు. దీంతో తల్లి దండ్రులు అతడిని ఆరేళ్ల క్రితం రేకుర్తిలోని అంధుల పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం శ్రీవత్సవ్ ఏడో తరగతి చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై, 9 : మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్(45)అతిగా మద్యం తాగి పట్టణంలోని ఓ పంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మృతి చెందాడు. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్ పాత సామాన్లు వస్తువులు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. మద్యానికి బానిసై నరేందర్ అతిగా తాగి మత్తులోనే పాత సామాన్ల కోసం మెట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో పడిపోయాడు. ఎంతకు అతనిలో ఎలాంటి కదలిక లేకపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి గమనించి అతడు మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 9: కరీంనగర్ సాయినగర్‌లోని సాయి బాబా గుడి వద్ద భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (50) మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మూర్ఛ వ్యాధితో మరణించాడని ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ కె.రవిందర్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు కరీంనగర్ రెండో ఠాణా సీఐ 8712670762, హెడ్ కాని స్టేబుల్ రవీందర్ 9491481433 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

శుభ్రంగా లేకపోవడంతో రూ.35వేల జరిమానా


రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూలై 9: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం నగరపాలక సంస్థ హెల్త్‌అసిస్టెంట్లు మంగళవారం గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలోని సాఫ్రాన్ మండి హౌస్‌లో తనిఖీలు జరిపారు. సరైన పరిశుభ్రత పాటించకుండా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించినట్టు కిరణ్, వైకుంఠం పేర్కొన్నారు. రెస్టారెంట్ యజమానులకు రూ.30వేల జరిమానా విధించా మన్నారు. ఈ ఆహార పదార్థాలను తిరిగి వినియోగించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం

● మార్పులు, చేర్పులు ప్రారంభం
● తమకు సంబంధం లేదంటున్న ఆర్అండ్‌బీ అధికారులు
● ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సొంత నిధులతో పనులు

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉందని మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన సొంత ఖర్చులతోనే మరమ్మతులు చేయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్యాంపు కార్యాలయానికి వాస్తు బాగా లేకపోవడం వలనే అపశృతు లు చోటు చేసుకుంటున్నాయనే ఉద్దేశ్యంతో పోర్టికో, కిటికీలు, తలుపు లు తొలగిస్తున్నారని ప్రచారం సాగుతోంది. గతంలో హుజూరాబాద్ నుంచి ఏడుసార్లు గెలిచి, తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఈటల రాజేందర్ ఈ క్యాంపు కార్యాలయానికి వెళ్లిన తర్వాతనే ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం పనులు 2019లో ప్రారంభించి 2020లో పూర్తి చేశారు. ఈ కార్యాలయంలోకి వెళ్లిన తర్వాత ఈటల రాజేందర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయ్యారు. అనంతర పరిణామాలతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచినా ప్రతిపక్షంలో ఉండడంతో ఆయనకు నియోజక వర్గంలో ఎలాంటి ప్రాధాన్యం లభించలేదు. ఆ సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆ సమయంలో ఈటల రాజేందర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉపయోగించేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓడిపోయారు. ఈటలకు కంచుకోటగా ఉన్న హుజూరాబాద్‌లో ఆయన ఓడిపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇదంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉండడం వల్లే జరిగిందని ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల్లో గెలిచి ఆరు నెలలైనా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాస్తు పండితులను తీసుకొచ్చి చూపించడంతో వారు పలు సూచనలు చేశారు. దానికి తగ్గట్లు పనులు ప్రారంభించారు.. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈని వివరణ కోరగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న పనులకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొనసాగుతున్న పనులు

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,275 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.258 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నల్లగొండ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 9: మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. ఆలయ సిబ్బంది గర్భ గుడి తాళాలు పగిలి ఉండటం గమనించి మంగళవారం ఉదయం ఎస్సై సందీప్‌కు సమాచారం అందించడంతో సిబ్బందితో అక్కడకు చేరుకున్న ఎస్సై డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి నర్సింహస్వామి విగ్రహంపై ఉన్న విలువైన 5.3 తులాల బంగారు ఆభరణాలు పుస్తెలు, కాసులహారం ఎత్తుకు పోయినట్లు గుర్తించారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆలయంలోని ఉత్సవ మూర్తులపై ఉన్న వెండి ఆభరణాలను వదిలి పోయినట్లు సిబ్బంది తెలిపారు. కొడిమ్యాల ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ఆలయ సిబ్బందిని, పలువురు భక్తులను విచారించారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

సుల్తానాబాద్, జూలై 9: సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సుల్తానాబాద్ మండలంలో పలు గ్రామాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐతరాజ్‌పల్లి గ్రామంలో యార్ల మల్లయ్య ఇంటి వద్ద ఆటోలో తరలించడానికి సిద్దంగా ఉన్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని ప్రేమ్‌కుమార్ వివరించారు. ఇట్టి బియ్యాన్ని పెద్దపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని అన్నారు. యార్ల మల్లయ్యపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లె గ్రామంలో పీడీఎస్ బియ్యం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేశామన్నారు. ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, బద్దెనపల్లికి చెందిన మోతె విజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విజయ్‌ను విచారించగా గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన నరేష్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపాడన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

● జగిత్యాల టౌన్: రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టౌన్ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతం నుంచి షేక్ అంజద్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా జగన్నాథ రథోత్సవం



కోరుట్లలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, జూలై 9: హరే రామ... హరే కృష్ణ నామస్మరణతో కోరుట్ల పట్టణం మారుమోగింది. మంగళవారం పెద్దపూర్ ఇస్కాన్ దేవాలయ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో జగన్నాథ రథోత్సవం ఘనంగా సాగింది. పట్టణంలోని వేంకటేశ్వర, నగేశ్వర దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు భక్తులు రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవం వేంకటేశ్వర దేవాలయం నుంచి ఐబీ రోడ్డు నంది, కార్గిల్, అంబేడ్కర్ చౌరస్తాల మీది జాతీయ రహదారిపై కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు హరే రామ హరే కృష్ణ నామస్మరణతో భజనలతో నృత్యాలు చేస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రహదారులను నీటితో శుభ్రం చేయగా ఇస్కాన్ భక్తులు రోడ్లపై రంగవళ్లులు వేస్తూ స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ రథోత్సవంలో పాల్గొన్న భక్తులతో కలిసి నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కోరుట్ల సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

శంకరపట్నం, జూలై 9: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కాశక రఘువరణ్ (44) అనే వ్యక్తి ఈ నెల 7న అతని బావమరిది పొరముళ్ల శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పైన శంకరపట్నం మండలం లింగాపూర్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అత్యవసర పనుల నిమిత్తం మెట్‌పల్లి గ్రామానికి వెళ్తుండగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి రైస్‌మిల్ వద్దకు చేరుకోగానే టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీ కొట్టాడు. బైక్ పైనుంచి ఇద్దరు కింద పడగా, కాశక రాఘువరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి టౌన్, జూలై 9: టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలో గల జిల్లా కేంద్రాల్లో, పట్టణ, మండల కేంద్రాల్లో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం ఎన్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఏజెంట్ కొరకు 5,000 రూపాయలు, మండల కేంద్రాల్లో 1000 రూపాయలు డీడీల రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వాళ్లు కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, హుజురాబాద్ సంబంధిత మండలాల వాళ్లు సేల్స్ టీం లీడర్ రాజు 9154298581ను, జగిత్యాల జిల్లాలోని మండలాల వారు రమేష్ 9154298572ను, సిరిసిల్ల జిల్లాలోని వాళ్లు శేఖర్ రావు 9154298576ను, హుస్నాబాద్ పరిధిలోని మండలాల వాళ్లు సురేష్ 9154298673ను సంప్రదించగలరని ఏటీఎం తెలిపారు. దీనికి గడువు తేదీ లేదని, ఆసక్తిగల వాళ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 9: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత ఇంటర్‌మీడియట్ పూర్తి చేసింది. డిగ్రీ మొదటి సంవత్సరం కరీంనగర్‌లోని ఓ కళాశాలలో చేరింది. అక్కడ తనతో చదివిన స్నేహితులు ఎవరూ లేరని కుటుంబీకులకు చెప్పి బాధపడింది. మంగళవారం తల్లి కూరగాయలు అమ్మడానికి ధర్మారం వెళ్లింది. తమ్ముడు చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తండ్రి జీవనోపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై 9: మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన గొట్టిపడుత శంకర్‌గౌడ్(67)అనే వృద్ధుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌గౌడ్ ఈ నెల 2న ఆరపేట ఎక్స్ రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శంకర్‌గౌడ్ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అన్న గొట్టిపడుత గంగారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 9: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లికి చెందిన కిష్టస్వామిగౌడ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కిష్టస్వామిగౌడ్ తన స్కూటీపై గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన యువకుడు రాజేందర్ బైక్‌తో అతివేగంగా ఢీకొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడు

● పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన ● బాలుడి పరిస్థితి విషమం



బాలుడిని అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తున్న సిబ్బంది



పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మూత తీసి ఉన్న సెప్టిక్ ట్యాంక్

పెద్దపల్లి టౌన్, జూలై 9: పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆసుపత్రి ఆవరణలోని సెప్టిట్ ట్యాంక్ మూత తెరిచి ఉంచడంతో మంగళవారం ఉదయం తొమ్మిదేళ్ల బాలుడు అందులో పడిపోయాడు. అతడి పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాములమ్మ దంపతులు కూలీ పనుల కోసం పెద్దపల్లికి వచ్చారు. సోమవారం శ్రీనివాస్‌కు జ్వరం రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారితో పాటు వారి తొమ్మిదేళ్ల కుమారుడు విలియమ్స్ ఆసుపత్రిలోనే ఉన్నాడు. మంగళవారం ఉదయం టాయిలెట్ కోసం ఆసుపత్రి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ గల ప్రదేశానికి వెళ్లాడు. ట్యాంక్ మూత తెరిచి ఉండడంతో విలియమ్స్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో ఆసుపత్రి సిబ్బంది అక్కడకు చేరుకొని బాలుడిని బయటకు తీశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాకాంత్‌ను వివరణ కోరగా, సెప్టిక్ ట్యాంకుపై మూత తెరిచి ఉన్న కారణంగానే బాలుడు అందులో పడ్డాడని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని వివరించారు.

ప్రమాదకరంగా బాలుడి పరిస్థితి

సుభాష్‌నగర్: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలోని సెప్టింక్ ట్యాంకులో పడిన బాలుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ట్యాంకులో పడిన బాలుడిని సకాలంలో గుర్తించక పోవడం, నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల ప్రస్తుతం కోమా స్థితిలో ఉన్నాడని, 48 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు.

భారతదేశానికి రక్షణ కవచం ప్రధాని మోదీ

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్



మున్నూరుకాపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్

వేములవాడ టౌన్, జూలై 9 : దేశంలో గోకుల్ బాంబు బ్లాస్టులు లేవని, లుబిని పార్క్‌లాంటి బ్లాస్టులు, టెర్రరిస్టుల అలజడి దేశంలో ఎక్కడ కనబడుతలేవంటే కేవలం ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి రక్షణ కవచంలా నిలుస్తున్నాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతానని హామీచ్చారు. ఆయా ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిశామన్నారు. అవసరమైతే కేంద్ర మంత్రిని వేములవాడకు తీసుకు వచ్చేందుకు కృషి చేసి అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మీరంతా కష్టపడి పని చేసినందుకే మంత్రిని అయ్యాయనని, నా గెలుపునకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సహకరించారని అన్నారు. నాకు భారీ మెజార్టీ అందించిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. అనంతరం పట్టణం బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమేశ్వర గార్డెన్‌కు వీచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మీరు తయారు చేసిన కార్యకర్తను అని, కింది స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తిని అని, కష్టమొచ్చిన కార్యకర్తలకు అండగా ఉంటానని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. దేశంలో మోదీ ప్రభుత్వం లేకుంటే 370 ఆర్టికల్ రద్దు చేసే సాహసం ఎవరూ చేసేవాళ్లు కాదన్నారు. మొన్నటి వరకు పార్లమెంట్ చేసే చట్టాలు జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేవి కాదని, 370 ఆర్టికల్ రద్దుతో భారతీయ జెండా సగర్వంగా ఎగురుతుందని ఉద్వేగభరితంగా చెప్పారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, దళితమోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, నాయకులు రేగుల మల్లికార్జున్, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ఘనంగా ఆషాఢమాస పూజలు



మానసాదేవి ఆలయంలో కుంకుమ పూజలు



మెట్‌పల్లి పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

గన్నేరువరం, జులై 9: మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి ఆషాఢమాస శోభ సంతరించుకుంది. స్వయంభువుగా వెలసిన మానసాదేవి ఆలయంలో ఆషాఢమాసం మొదటి మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చాలని ముడుపులు కట్టి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు అమర్‌నాథ్ శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయంలో కల్యాణ కాత్యాయనీ దేవి వ్రతాన్ని ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మీ గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

గన్నేరువరం, జులై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండల ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు భిక్షపతికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల కన్వీనర్, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. హామీలలో భాగంగా మహాలక్ష్మి పథకంలో 18 సంవత్సరాల నుంచి ప్రతి మహిళకు నెలకు 2,500 ఇవ్వాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతకు రైతుభరోసా సాయం 7,500 అందించాలని, వ్యవసాయ కూలీలకు 12000, కౌలు రైతులకు 15000, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేనివారికి 200 గజాల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5లక్షలను, కేంద్ర ప్రభుత్వం పది లక్షలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీల ఎల్లయ్య, మండల నాయకులు పాశం వేణు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించడం లేదని పంచాయతీ కార్యాలయానికి తాళం



తాళం వేసి ఉన్న రాంసాగర్ పంచాయతీ భవనం

కొడిమ్యాల, జూలై 9 : ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బిల్లులు చెల్లించడం లేదని జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని రాంసాగర్ గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ నీలగిరి గంగారావు మంగళవారం తాళం వేశాడు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మాట్లాడుతూ గ్రామంలో రూ. 20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించినట్లు తెలిపాడు. 2024 ఫిబ్రవరిలో భవన నిర్మాణం పూర్తి చేసి అప్పగించానన్నారు. ఇప్పటి వరకు తనకు రావాల్సిన డబ్బులు అందలేదన్నాడు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత చెల్లిస్తాం అంటున్నారే తప్ప బిల్లులు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కారణంగా కార్యాలయానికి మంగళవారం తాళం వేశానని కాంట్రాక్టర్ గంగారావు తెలిపాడు. ఈ విషయమై ఎంపీవో వాసవిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతోనే చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు త్వరలో చెల్లించేలా చూస్తామని కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో బుధవారం తాళం తీస్తానని చెప్పారని తెలిపారు.

దొంగ అరెస్ట్

పెద్దపల్లి టౌన్, జూలై 9 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మే 28న హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం, మైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ గతంలో నెన్నల్, రెబ్బనలోని ఆలయాల్లో దొంగతనం చేయగా కేసులు నమోదు కావడంతో ఏడాది కాలం జైలుకు వెళ్లాడు. గత ఐదేళ్లుగా పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉంటూ సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడని అన్నారు. జల్సాలకోసం తిరిగి అయ్యప్ప ఆలయంలో దొంగతనం చేశాడని , అతన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పెద్దపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగను గుర్తించి అతని వద్ద రూ.4370లను రికవరీ చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంతో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మల్లేశంతో పాటు సిబ్బందిని అభినందించారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న రంగపేట క్రీడాప్రాంగణం

మానకొండూర్, జూలై 9: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశ్యం లక్షల రూపాలయలను వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నెలకొల్పాడు. గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మండలంలో 27 గ్రామపంచాయితీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక అక్కడ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26 గ్రామాలలో ఒక్కొక్క దానికి రూ. 2లక్షల ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లింపులు జరిగాయి. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టు, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడా ప్రాంగణం గ్రామానికి సుమారు 4కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. ప్రతి గ్రామానికి 16 రకాల ఆట వస్తువుల కిట్టును అధికారులు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన కిట్లు మూలన పడడంతో యువత క్రీడా ప్రాంగణాలను దూరం అయ్యారు. దీంతో క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

చెస్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 9: జిల్లా స్థాయి చెస్ పోటీల్లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం కొత్తపల్లిలోని ఈ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి చెస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆర్ సుచరిత, జి అయాన్, ఎస్ వేదాంశ్, లికిత, ఎస్ సరాహర్షిని, ప్రణవి, అద్వేతయలు అద్భుత ప్రతిభ చాటి చెస్ పోటీల్లో విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16నుంచి 'రైతు నేస్తం'

-చామనపల్లి రైతు వేదికలో ఏర్పాట్లు

కరీంనగర్ రూరల్, జూలై9: రైతులకు సాగు విధానంపై మెలకువలను అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాలు కరీంనగర్ రూరల్ మండలంలో ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి చామనపల్లి గ్రామంలోని రైతు వేదికలో కరీంనగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం ఏర్పాట్లు చేస్తున్నారు. రైతుల సౌకర్యార్థం ఎల్ఈడీ టీవీలను అమర్చుతున్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి అప్‌డేట్ చేసేందుకు కంప్యూటర్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. పంటల సాగుపై స్క్రీన్‌లపై ప్రదర్శన, శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాజేందర్‌రావుకు నన్ను విమర్శించే అర్హత లేదు

-మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 9: ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే ఒక పొలిటికల్ టూరిస్ట్ వెలిచాల రాజేందర్‌రావుకు తనను విమర్శించే నైతిక హక్కు లేదని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న తనను ఒకసారి మున్సిపల్ కౌన్సిలర్‌గా, మూడుసార్లు కార్పొరేటర్‌గా, ఒకసారి తన భార్యను కార్పొరేటర్‌గా గెలిపించారని, ఐదేళ్ళ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రజలకు, రైతులకు సేవ చేశానని అన్నారు. నాలుగున్నరేళ్ళుగా మేయర్‌గా నగర అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు. మీలాగా ప్రభుత్వ సంస్థల్లో రుణాలు తీసుకొని ఇండస్ట్రీలు పెట్టి ప్రజల సొమ్ముతో ప్రభుత్వాలను ముంచిన వాళ్ళముకాదని రాజేందర్‌రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ

-55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత

గణేశ్‌నగర్, జూలై 9: ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నడుస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ తీసుకున్న విద్యార్థుల నుంచి 55 మంది ఉత్తీర్ణత సాధించారని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, ఒక ప్రకటనలో తెలిపారు. వీరందరినీ స్టేట్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరసింహారెడ్డి అభినందించారు. వీరికి మెయిన్స్ ప్రిపరేషన్ కు తగిన సలహాలు, సూచనలు స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్ టౌన్, జూలై 9: నగరంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, మేయర్ సునీల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని, లేకపోతే ఇందిరమ్మ ఇళ్లను ఆక్రమించి పేదలకు కేటాయిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు పున్నం రవి, పుల్లెల మల్లయ్య, కొంపల్లి సాగర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి

హుజూరాబాద్, జూలై 9: ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం సీపీఎం నాయకులు హుజూరాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదని, లక్షలాది కుటుంబాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక పథకాలకు దూరమవుతున్నారన్నారు. ప్రతి రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ నిర్ణీత గడువులోగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రయ్య, రాజు, బాలకృష్ణ, రవి, శ్రీధర్, రవీందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'ప్రజలను మభ్య పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

సైదాపూర్, జూలై 9: రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం సీపీఐ పార్టీ సైదాపూర్ మండల కౌన్సిల్ సమావేశం మండల కేంద్రంలో కొమ్ముల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అజరైన మర్రి వెంకట స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంది రవిందర్‌రెడ్డి, నాయకులు ఒడ్నాల వెంకటేష్, దొనికెన అనీల్, రాజేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

చొప్పదండి, జూలై 9: సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని చొప్పదండి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న, గుర్రం హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్ సీఐ బదిలీ

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ టౌన్ సీఐగా పనిచేస్తున్న బొల్లం రమేష్‌ను బదిలీ చేస్తూ మంగళవారం ఐజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లాలో పనిచేస్తున్న కిరణ్‌ను హుజూరాబాద్ టౌన్ సీఐగా నియమించినట్లు సమాచారం. కాగా సీఐ బొల్లం రమేష్ రెండేళ్లుగా హుజూరాబాద్ సీఐగా పనిచేశారు. గత ఎంపీ ఎన్నికల ముందు కూడా రమేష్ బదిలీ కాగా కొత్త సీఐ విధుల్లో చేరేందుకు రాగా సీపీ అభిషేక్ మొహంతి విధుల్లో చేర్చుకోవడానికి ఒప్పుకోలేదు. దీంతో టౌన్ సీఐగా మళ్లీ రమేష్ కొనసాగారు. ఈ క్రమంలో రమేష్ మళ్లీ బదిలీ కావడం విశేషం.

ఆకట్టుకున్న గ్రీన్ కలర్ డే వేడుకలు



గ్రీన్ కలర్ డేలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామడుగు,జూలై9: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన గ్రీన్ కలర్‌డే వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రీన్ కలర్‌డే ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, ఇంచార్జి సుమలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తయారు చేద్దాం



కాన్షియస్ క్లబ్‌ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, జూలై 9: అధికారులు, ప్రజలు అందరం కలిసి డ్రగ్స్ అనే మహమ్మారిని జిల్లా నుంచి తరిమికొడదామని, కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తయారు చేద్దామని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో డ్రగ్స్ నియంత్రణపై ఎక్సైజ్‌శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, అల్కహాల్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాల బారిన పడి యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి బారిన పడకుండా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో అన్ని విద్యాసంస్థల్లో 'కాన్షియస్ క్లబ్'లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి క్లబ్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు, వలంటీర్లు, విద్యార్థులు ఉంటారని పేర్కొన్నారు. జూలై నెల ఆఖరి వరకు అన్ని విద్యా సంస్థలు, హాస్టళ్లలో కాన్షియస్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ కొనుగోలు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. నాన్ బెయిలబుల్ కేసులతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి ఎవరైనా విక్రయించినా అధికారు లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఏమైనా వివరాలు తెలిస్తే కరీంనగర్‌లోని కంట్రోల్ రూమ్ 8019263862, టీజీఎన్ ఏబీ నంబర్ 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయనున్న కాన్షియస్ క్లబ్‌లకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, సంక్షేమ అధికారి సరస్వతి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులందరికీ సీట్లు కేటాయించాలి

గణేశ్‌నగర్, జూలై 9: ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహాల్లో దరఖాస్తు చేసుకున్న బీసీ విద్యార్థులందరికీ సీట్లు కేటాయించాలనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు వసతి లేక సంక్షేమ వసతి గృహాల్లో సీట్లు లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీట్ల సంఖ్య 150 నుండి కనీసం 300 వరకు పెంచాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అఖిల పక్ష నాయకులు బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

కరీంనగర్ రూరల్, జూలై9: జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డుల కోసం చేపట్టాల్సిన చర్యలపై మండల పరిషత్‌లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా యంపీఓ జగన్‌మోహన్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు నేషనల్ పంచాయత్ అవార్డు యాప్‌పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో చేపట్టిన సానిటేషన్ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులను యాప్‌లో పొందు పరచాలని సూచించారు.

చదరంగ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 9: కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాలల అధినేతలు అభినందించారు. మంగళవారం మానేరు పాఠశాలలో ఆ పాఠశాలకు చెందిన లిఖిత్ చైతన్య అండర్-11 విభాగంలో ప్రతిభ కనబరిచి విజేతగా నిలువగా, మరోవిద్యార్థి శివచైతన్య ఓపెన్ విభాగంలో ఐదు రౌండ్లకుగాను మూడు రౌండ్లలో విజయం సాధించి ప్రశంసలు అందుకోవడంతో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి వారిని అభినందించారు. భగత్‌నగర్‌లోని అద్విత ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థి ఎస్.శ్రావిక్ ప్రముఖ్ రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో విశేష ప్రతిభచాటి కాంస్య పతకాన్ని గెలుచుకోవడం పట్ల ఆ విద్యాసంస్థల చైర్మన్ సోగాని అనుదీప్ ఆయనను అభినందించారు.

ఉపాధ్యాయులకు స్మార్ట్ క్లాస్‌లపై శిక్షణ

కరీంనగర్ టౌన్, జూలై 9: యునిసెడ్ సంస్థ సమగ్ర శిక్షణ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఫిలింభవన్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు సోలార్ పవర్డ్ స్మార్ట్ క్లాస్‌లకు సంబంధించిన శిక్షణ తరగతులను నిర్వహించారు. హిందుస్థాన్ పెట్రోలియం సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 125 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమానికి యూనిసెడ్ సంస్థ మానిటరింగ్ డైరెక్టర్ కె.గిరిజాశంకర్, రిసోర్స్‌పర్సన్ రాజు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, సమగ్రశిక్ష కో ఆర్డినేటర్లు అబ్దుల్ బారి, అశోక్‌రెడ్డి, అంజనేయులు, డి.కృపారాణి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ తొర్తి శ్రీనివాస్, ఎంఈవో మధుసూదనచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ హామీని నిలబెట్టుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 9: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు డిసెంబర్-24లోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని బీఆర్‌ఎస్ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితులు కాంగ్రెస్ ఏడునెలల్లోనే మళ్ళీ కనిపిస్తున్నాయన్నారు. నిధులు, నీళ్ళు, నియామకాల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా నిలిచి వారి హక్కులు సాధించుకునే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ప్రజాపాలన పేరు చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పటి వరకు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాయల సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నాయకులు చేతి చంద్రశేఖర్, ఆరె రవి, బొంగూరి మోహన్, చుక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా 'స్మార్ట్‌సిటీ' పనులు పూర్తి చేస్తాం



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 9: స్మార్ట్‌సిటీ మిషన్‌కు ఇచ్చిన గడువు మార్చి-2025లోగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులన్నిటినీ పూర్తి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న ఎస్‌పివి, ఐసీసీసీ, డీఆర్ఎఫ్ నూతన భవనాన్ని సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను వేగంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. 15 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనం పనులు ఇప్పటికే 70శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తిచేసి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఇప్పటి వరకు 765 కోట్ల రూపాయలు నగరపాలక సంస్థకు విడుదల చేశారని, వాటితో ప్రణాళికాబద్ధంగా సుందర నగరంగా అభివృద్ధి చేసే ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ అభివృద్ధిలో తమ పాలకవర్గం పూర్తిస్థాయిలో విజయవంతమైందని సంతృప్తిని వ్యక్తం చేశారు మేయర్ సునీల్‌రావు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు విడుదల చేసిన 765 కోట్లలో 735 కోట్లను పనుల కోసం ఖర్చుచేశామని, 30 కోట్ల రూపాయల నిధులు రాష్ట్ర ఖజానాలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మరో 30 కోట్లు విడుదల చేస్తే 65 కోట్లతో జరుగుతున్న పెండింగ్ ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ మహేందర్, డీఈఈ అయూబ్, పిఎంసి సందీప్, ఏఈ గట్టుస్వామి, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మం సమాజ వికాసానికి దోహదపడుతుంది

కరీంనగర్ రూరల్, జూలై 9: మానవ జీవితానికి, సమాజ వికాసానికి ధర్మం తప్పనిసరి అని వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని దుర్గభవాని ఆలయంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరీ ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయంలో సుహాసినిల సౌందర్యలహరి జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ శక్తివంతమైన మనసు సాఫల్యమైన జీవితాన్నిస్తుందన్నారు.

కరివేపాకు అలంకరణలో అమ్మవారు

శ్రీదుర్గభవాని ఆలయంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని కరివేపాకు మాలలతో అలంకరించారు. విశేష హారతుల్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని చీరెసారె సమర్పించి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఆమోదం

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 93అంశాలకు 91 పనులకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. పట్టణంలో సుందరీకరణ పేరిట డిపో క్రాస్ ఏరియాలో జంక్షన్ ఏర్పాటుకు రూ. 40లక్షలు, రూ. 80లక్షలతో కరీంనగర్, వరంగల్ రోడ్‌లలో ఎంట్రెన్స్‌లో కమాన్ ఏర్పాటు, 25,29వ వార్డులలో ఓపెన్ జిమ్‌లకు రూ. 32లక్షల అమోదం తెలిపారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన 4 ఆటో ట్రాలీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్యలు ప్రారంభించారు. అలాగే పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, బూట్లు, చేతికి గ్లౌజ్‌లు, దుస్తులను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ రాధికకు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

స్థానిక వ్యాపారుల సమస్య పరిష్కరించాలని వినతి

హుజూరాబాద్ బస్టాండ్ లోపలికి వెళ్లే దారిలో డబ్బా ఉండడంతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, వెంటనే దానిని తొలగించాలని స్థానిక వ్యాపారులు మంగళవారం మున్సిపల్ చైరపర్సన్ గందె రాధికకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 25ఏళ్ల క్రితం బస్టాండ్ కాంప్లెక్స్‌లో 36షెటర్లను అప్పటి గ్రామపంచాయతీ నిర్మించిందన్నారు. ఈ బస్టాండ్ లోపలికి వెళ్లేందుకు జమ్మికుంట రోడ్ నుంచి 18 ఫీట్ల రోడ్డు ఉండేదన్నారు. అయితే ఇటీవల ఓ వ్యక్తి డబ్బా వేయడంతో పాటు దాని పక్కనే మద్యం సేవిస్తుండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ డబ్బాతో తమ చిరు వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, బస్టాండ్ కాంప్లెక్స్ అసోసియేషన్ సభ్యులు రాముతో పాటు పలువురు ఆరోపించారు. డబ్బాను తొలగించి న్యాయం చేయాలని కోరారు.

బీజేపీ నాయకుల ధర్నా

రామడుగు, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఉచిత రేషన్ కార్డులు, రైతు భరోసాను, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఉద్యోగ ప్రకటనలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖాధ్యక్షులు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉప్పు రామ్‌కిసన్, మాజీ ఎంపీటీసీ మోడి రవీందర్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, బండ తిరుపతిరెడ్డి, పోచంపల్లి నరేష్, పురేళ్ల శ్రీకాంత్‌గౌడ్, యువమోర్చా నాయకుల దూరుశెట్టి రమేష్, జీతేందర్, సాంగసాని మల్లేశం, ఎడవెల్లి రామ్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సైదాపూర్, జూలై 9: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సైదాపూర్ తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెలిమారెడ్డి రాజిరెడ్డి, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, మండల సభ్యులు ఎండీ హుస్సేన్, నాయకులు ఉన్నారు.

● ఇల్లందకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్య దర్శి చెల్పూరి రాము, కొత్తూరి మల్లయ్య, గురుకుంట్ల బాబు, వెంకన్న, రాజు, అయిలయ్య, శంకర్ పాల్గొన్నారు.

'ఆసుపత్రి సౌకర్యాల కల్పనపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా'

రామడుగు, జూలై 9: మండలంలోని గుండి గోపాల్‌రావులోని ప్రాథమిక ఆసుపత్రిలో సౌకర్యాల కల్పనపై చొప్పదండి ఎమ్మెల్యే సత్యం దృష్టికి తీసుకెళ్లి ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడుతానని గోపాల్ రావుపేట మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నవెంకటరామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆసుపత్రిని సందర్శించి మాట్లాడారు.

చిన్న వర్షానికే చిత్తడిగా రోడ్లు

వీణవంక,జూలై 9: మండల కేంద్రానికి నర్సింగాపూర్ గ్రామాల మధ్య గల జమ్మికుంట కరీంనగర్ రహదారి చిన్న వర్షానికే చిత్తడిగా మారుతోంది. దాదాపు 20కోట్ల రూపాయలతో నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు గత నవంబర్ నెలలో ప్రారంభించారు. దాదాపు ఏడు నెలలు గడిచినా పనులు పూర్తికాక పోవడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడినపుడు రోడ్డు బురదగా మారడంతో ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి పూర్తిగా మట్టి పోసి విడిచిపెట్టడంతో వర్షం పడితే రోడ్డు పూర్తిగా బురదతో నిండుతోంది. రెండు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు నెలలు గడిచినా పూర్తికాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్డును పరిశీలించి కంకర పోయించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వీణవంక నర్సింగాపూర్ గ్రామాల మధ్య బురదమయమైన రోడ్డు

ఐసీఈయూ కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, జూలై 9: ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్(ఐసీఈయూ) బ్రాంచి-2 కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా వీరేశం, కార్యదర్శిగా పురుషోత్తం, ఉప కార్యదర్శిగా రాజనర్సింగరావు, కోశాధికారిగా ఎండి షరీఫొద్దీన్, కార్యవర్గ సభ్యులుగా బి.నర్సయ్య, బి మల్లారెడ్డి, ఎండి రజాక్, జి.లక్ష్మణాచారిలను ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

భగత్‌నగర్, జూలై 9: కరీంనగర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్)గా ఎం.పోచయ్యలింగం మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) హైదరాబాద్‌లోని బస్ భవన్‌కు లాండ్ అండ్ సివిల్‌కు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్‌లో డిప్యూటీ ఈఈ సివిల్‌గా పనిచేస్తున్న ఎం.పోచయ్యలింగం పదోన్నతిపై కరీంనగర్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్టీసీ ఆర్ఎం సుచరితను మర్యాదపూర్వకంగా కలిశారు.

హుండీల లెక్కింపు 11కు వాయిదా

కరీంనగర్ కల్చరల్, జూలై 9: అనివార్య కారణాల వల్ల నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో శుక్రవారం లెక్కించే హుండీల లెక్కింపు వాయిదా వేసినట్లు, దీనిని ఒక రోజు ముందుకు జరుపుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు లెక్కించనున్నట్లు ఈఓ ఎండపెల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు.

పూజా సామగ్రి, దుకాణాల నిర్వహణకు టెండర్లు

కరీంనగర్ కల్చరల్, జూలై9: స్థానిక మంకమ్మతోట వేంకటేశ్వ రాలయంలో ఈనెల 15న ఉదయం 11-30 గంటలకు కొబ్బరి కాయలు, వాహన, పూజా సామాగ్రి అమ్మకాలు, మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ పరిధిలోని 5దుకాణాల నిర్వహణకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

నియామకం

కరీంనగర్ రూరల్, జూలై9: కరీంనగర్ రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలిగా గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మోరపాక మంజులను నియమిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆమెకు అందజేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'డబ్బు ఇవ్వనందుకు ప్రమోషన్ ఆపారు'

సుభాష్‌నగర్, జూలై 9: అడిగిన డబ్బు ఇవ్వలేదని ప్రమోషన్ ఆపారని హెల్త్ సూపర్‌వైజర్ రాజకుమారి ఆరోపించారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తిమ్మాపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా చేస్తున్నట్లు తెలిపారు. రెగ్యులరైజేషన్ కోసం సీనియర్ అసిస్టెంట్ షమ్మీర్ తనను రూ.15000లు అడిగారని, ఆ డబ్బు ఇవ్వలేదని, అందుకు తనకు రావలన్సి ప్రమోషన్ తనకంటే జూనియర్స్‌కు ఇచ్చాడని ఆరోపించారు.

మొక్కు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకుడు

కరీంనగర్ అర్బన్, జూలై 9: కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి సుడా చైర్మన్ పదవి చేపట్టడంతో గోదాంగడ్డ ప్రసన్నాంజనేయ దేవాలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి కాంగ్రెస్ పార్టీ 15వ డివిజన్ అధ్యక్షుడు కొట్టె ప్రభాకర్ మొక్కు తీర్చుకున్నాడు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీకాంత్ యాదవ్, పున్న అనిల్, జ్యోతిరెడ్డి, శ్రవణ్ నాయక్, పొరండ్ల రమేష్, దన్న సింగ్, పెద్దిగారి తిరుపతి, గంగుల దిలీప్, ముల్కల కవిత, భరత్, కీర్తి కుమార్, యొన, తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ రూరల్, జూలై9: సుడా చైర్మన్‌గా బాధ్యలు స్వీకరించిన కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యకంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయినితిరుపతి, మండల ప్రధాని కార్యదర్శి తిరుపతి, బుర్ర హరీష్ గౌడ్, గంగుల దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గంగాధర, జూలై 9: మండలంలోని మధురానగర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజు తండ్రి కొమురయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మంత్రి బండి సంజయ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ నియో జకవర్గ కన్వీనర్ శ్రవణ్,అశోక్, తాళ్ల రాజశేఖర్ ఉన్నారు.

చొప్పదండిలో వనమహోత్సవం

చొప్పదండి, జూలై9: చొప్పదండిలో వనమహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ కె.నాగరాజు, మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఎన్నం అంజయ్య, శివాణి, సిబ్బంది ఉన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ 76వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అజయ్, కార్తీక్, శివ, అరుణ్, వరుణ్, రాంచరణ్, అభిలాష్, కౌశిక్, అఖిల్, సంజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను తొలగించాలి

గంగాధర, జూలై 9: గంగాధర మండల కేంద్రంలోని చొప్పదండి నియోజవర్గ జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విద్యుత్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడిపై దాడి

మానకొండూర్, జూలై 9: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో ఈదులగట్టెపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ పై మంగళవారం దాడి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన విషయంలో మాజీ సర్పంచు రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌లు ఇద్దరు గొడవపడ్డారు. తర్వాత మాటామాటా పెరిగి పెనుగులాడుకున్నారు. కాగా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు మాజీ సర్పంచు రాజు కుటుంబ సభ్యులు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌పై దాడి చేయడంతో గాయపడ్డాడు. ఈ విషయంపై ఇరువర్గాలు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొలంబడి కోసం రైతుల ఎంపిక

తిమ్మాపూర్, జూలై9: తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో జాతీయ సమగ్ర సస్య రక్షణ విభాగం, హైదారాబాద్ వారి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం కొరకు రైతులను ఎంపిక చేసినట్లు మండల వ్యవసాయాధికారి సురేందర్ తెలిపారు.

● ఇల్లందకుంట, జూలై 9: తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్‌గా ఎన్నికైన మెట్టు సాయికుమార్‌ను మంగళవారం జిల్లా ఫిషరీస్ చైర్మన్ బండి మల్లేష్ హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.